


పెద్దలకు మాత్రమే!

ఈ భూమ్మీద ఎక్కడ ఏ గొప్ప విషయం జరిగినా అక్కడ పుట్టనందుకు గొప్ప బాధపడిపోతుంటాడు బాబ్జీ. అమెరికా, రష్యా, ఫ్రాన్సుల్లో పుట్టనందుకు అతను అనేకసార్లు వర్రీ అవడం నాకు తెలుసు. పేపర్లో ఏదో వార్త చదువుతాడు. గొప్ప వార్తే. కాదనం. దానితో బాబ్జీకి వెర్రెక్కుతుంది. మిమ్మల్ని నడిరోడ్డు మీద నిలబెడతాడు. చదివిన వార్తేమిటో చస్తే చెప్పడు. ఎక్కడ జరిగిందో ఆస్థల పురాణం ప్రారంభిస్తాడు. అక్కడ తాను జన్మించనందుకు అరగంట విచారపడతాడు. ఈలోగా మీరు చిరాకు పడిపోతారు. మీ పని చెడగొట్టి, మీటింగు పెట్టినందుకు బాబ్జీమీద కోపం వస్తుంది. ఆ కోపం తారస్థాయికి చేరుకుంటుంది. బాబ్జీ చొక్కా పట్టుకుని గుంజుతారు. అదిగో అప్పుడు చెబుతాడు వార్తేమిటో.

ఆ మధ్య ఒకసారి ఆబిడ్స్ తాజమహల్లో కాఫీ తాగుతుండగా కనిపించేడు. మదరాసులో పుట్టనందుకు వర్రీ అయిపోతూ నాకు చిరాకు కలిగించాడు. చివరకు అసలు సంగతి చెప్పనే చెప్పేడు. అంతర్జాతీయ ఫిల్మోత్సవం మదరాసులో జరగబోతున్న వార్త బాబ్జీని కదలించిందంట. బాబ్జీకి సినిమాలంటే వల్లమాలిన ఇష్టం. వప్పుకుంటాను. ఇంగ్లీషు పిక్చర్లు మరింత ఇష్టం. అదీ వప్పుకుంటాను. అయితే ఇష్టం వెనక ఒక ఫీలాసఫీ వుంది.

అతనికి ఇంగ్లీషు పిక్చరు సొంతం అర్థం కాదు. అక్కడో సీనూ ఇక్కడో సీనూ కొంచెం కొంచెంగా అర్థమవుతాయి. వాటి ఆధారంతో మొత్తం సినిమా అర్థమైన ఫీలింగు కలుగుతుంది. అక్కడికే తృప్తి పడిపోతాడు. బ్యూటీ జంగిలనే సినిమాకి వెళ్ళొచ్చి, ఆ కథ నాకు చెప్పేడు. ఆ తర్వాత నేను కూడా ఆ సినిమాకి వెళ్ళవలసి వచ్చింది. అయితే బాబ్జీ చెప్పిన కథకి చిత్రం చూస్తుండగా నాకు అర్థమైన కథకి ఎంతో తేడా కనిపించింది. ఆమాట కొస్తే దానికి, దీనికి పోలికే లేదు. అదే అడిగేను. వాడు విసుక్కుంటూ అన్నాడు : ఇంగ్లీషు సినిమాల్లో కథెవడిక్కావాలోయ్. కథా మాటలు అయ్ డోంట్ కేర్. మన సినిమాల్లో కరువైన మసాళాలు ఆ సినిమాల్లో చూడొచ్చు. కనీసం అయిదారు సీనుల్లో సెక్సుంటుంది. టిక్కట్టు ఖర్చు గిట్టు బాటవుతుంది. ఇంక కథంటావా....అర్థమైనంత వరకూ అర్థమవుతుంది. మిగతాది గాలిక్కొట్టుకు పోతుందన్నాడు చిరాగ్గా.

అంతర్జాతీయ ఫిల్మోత్సవంలో అనేక దేశాల చిత్రాలు ప్రదర్శిస్తారు. మనకున్న పట్టింపులు వాళ్ళకుండవు. ముద్దులూ, అర్ధ నగ్న శరీర ప్రదర్శనలూ, అవసరమనుకుంటే పూర్తి నగ్న దృశ్యాలూ ఆ చిత్రాల్లో చోటుచేసుకుంటాయి. ఫెస్టివల్ పుణ్యమాని ఆ బాపతు సినిమాలు చూసేసి ముచ్చట తీర్చుకోవచ్చని బాబ్జీ ఉద్దేశ్యం. అందుకే అతను మదరాసులో పుట్టనందుకు తెగ వర్రీ అయిపోయేడు. ఆ మాటకొస్తే నేను కూడా కొంచెమో గొప్పో బాబ్జీ జాతివాడినే. ఆ మసాళా చిత్రాలు చూడాలని నాకూ వుంది. నన్నడుగుతే ఈ కోరిక తొంభై పర్సెంటు జనాభాలో వుంటుందని ఢంకా బజాయించి చెప్పగలను.

ఏది నిషేధమో, సరిగ్గా దాని మీదే మనిషికి మోజెక్కువ. మన చిత్రాల్లో ముద్దు నిషేధము కనుక ముద్దుమీద మనకి ఇంటరెస్టెక్కువ. సెన్సారెత్తేస్తే మన చిత్రాలలో కూడా సెక్సు గత్రాలు గుప్పించేస్తే ఫెస్టివల్ చిత్రాల గురించి అసలు పట్టించుకోం. తెరమీద ముద్దు తప్పో వప్పో వదిలేయండి. వద్దనేది ముద్దు గొలిపేమాట. అంత మాత్రంచేత వీధుల్లో ముద్దు పెట్టుకునే జనాభా మన గడ్డమీద లేరు. మనకట్లాంటి ఫీట్లు చెల్లవు. అందుచేత సినిమాలలో ముద్దు వద్దు అన్నారుట. ఇంగ్లీషు చిత్రాల్లో అడుక్కో ముద్దుంటుంది. అందుకే బాబ్జీకి చిత్రాలంటే అంత ఇష్టం.

కన్నడ చిత్రం దేంట్లోనో ముద్దు పేట్టేరన్న వార్త భగ్గుమంది. బాబ్జీ కనిపిస్తాడేమోనని చూసేను. ఎవరో చెప్పేరు. మైసూరు కోరి బదిలీ చేయించు కున్నాడని. అతని తెగింపుకి ఎంతో ముచ్చట పడిన మాట వాస్తవం. పెడితే అన్నిభాషా చిత్రాల్లోనూ పెట్టాలి గానీ కన్నడమనీ, తమిళమనీ, మళయాళమని సంవత్సరానికో చిత్రంలో పెడుతుంటే బాబ్జీ అంత రాష్ట్రి బదిలీలతో అలిపోయేది ఖాయం. భారతీయ చిత్రాలన్నింటిలోనూ ముద్దుపైనున్న నిషేధాన్ని తొలగిస్తారా లేదా అని అద్వానీగారు కనిపిస్తే గట్టిగా అడిగి తేల్చుకుందామని తొందరగా వుంది. ఎప్పుడు ఆ అవకాశ మొస్తుందో ఏమో!

మదరాసు ఫిలిం ఫెస్టివల్‌కి హాజరై వచ్చిన ఒక పత్రికా విలేకరి కాకతాళీయంగా కనిపించేడు. అతన్ని చూడగానే బ్లూ ఫిలిమ్ చూసినంత సరదా కలిగింది. ఆ మాటే అతన్తో అన్నాను. అతను నా అమాయకత్వానికి నవ్వేసి "మీలాగే చాలామంది అమాయకులు ఆ చిత్రాలలో సెక్సు బాగా గుప్పించి వుంటారని భ్రమపడి సీజను టిక్కెట్లు ఎగబడి కొన్నారు. గంటలో మొత్తం టిక్కెట్లు ఖర్చై పోయేయి. ఆ తర్వాత బ్లాకులో రెట్టింపు ధరకి అమ్ముకున్నారు. కానీ, ఆ బాపతు సినిమాలు ఏవీ ప్రదర్శించకపోవడంతో అవే టిక్కెట్లు సగానికి సగం ధరకి అమ్ముడయ్యేయి. అయ్యా, అదీ కథ." అన్నాడు.

ఈ సంగతి బాబ్జీకి తెలుస్తే మదరాసులో పుట్టనందుకు ఆనందిస్తాడు.